క్లుప్తంగా

మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా శ్యాం రవిప్రకాశ్



కొవ్వూరు: మాలసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందిన బొంతా శ్యాం రవిప్రకాశ్ నియమితులయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో తుమ్మల ఫ్రాన్సిస్ అధ్యక్షత నిర్వహించిన మాల సంఘాల జేఏసీ సమావేశంలో తనను ఈ పదవికి ఎంపిక చేసినట్టు శ్యాం రవి ప్రకాశ్ మంగళవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో బలమైన ఉద్యమ నాయకత్వం కోసం అన్ని మాల సంఘాలు ఒకటై ఉద్యమానికి పిలుపు ఇచ్చినట్టు ఆయన ప్రకటించారు. మాలలపై, అంబేడ్కర్‌పై ఎమ్మార్పీస్ నేత మంద కృష్ణ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొడతామన్నారు.రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమవుతామన్నారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు చాగల్లు ఎస్సై కె.రవీంద్ర మంగళవారం తెలిపారు. వారందరూ బ్రాహ్మణగూడెం శివారు పంట పొలాల్లోని షెడ్‌లో పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రూ.21,800 నగదు స్వాధీన పరుచుకున్నట్టు ఎస్సై కె.రవీంద్ర తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని అట్లపాడు గ్రామంలో వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన ఉజ్జిన కిరణ్‌కుమార్ భార్య సత్యవతి ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి బంధువులు ఇళ్ల వద్ద ఆమె ఆచూకీ కోసం వెదికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. దాంతో భర్త కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఇరువర్గాల కొట్లాట .. కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలో కోరుమామిడి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. కోరుమామిడికి చెందిన రాపాక రామకృష్ణకు అదే గ్రామానికి చెందినర గుంపుల బుల్లియ్యకు పాత గొడవలు ఉన్నాయన్నారు. ఈనెల 16వ తేదీ సోమవారం రాత్రి ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు తగాదా పడి కొట్టుకోవడంతో రాపాక రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

పెరవలిలో 26 మంది రక్తదానం

పెరవలి: రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పెరవలిలోని దీపికా ఫంక్షన్ హాల్లో రక్తదానం శిబిరం నిర్వహించారు. జన సైనికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పెరవలి ఎస్ఐ అప్పారావు ప్రారంభించారు. శిబిరంలో 26 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో నందప శ్రీనివాస్ చక్రవర్తి, పి నాగేశ్వరరావు, దేవరపు ఏడుకొండలు, కోటిపల్లి మురళీ కృష్ణ, సంగీతం నాగు తదితరులు పాల్గొన్నారు.

నెలటూరులో ప్రధాని మోదీ బర్త్ డే వేడుకలు

చాగల్లు: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును మంగళవారం మండలంలోని నెలటూరు గ్రామంలో బీజేపీ నాయకులు వేడుకగా నిర్వహించారు. మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. నెలటూరు, చాగల్లు ఇందిరమ్మ కాలనీ, మల్లవరం ఎంపీపీ స్కూళ్లలోని విద్యార్థులకు స్వీట్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్దిపాటి సురేష్, తాళ్లూరి వరప్రసాద్, జుట్ట గణపతి, కండిబోయిన సూర్యప్రకాశరావు, సుంకవల్లి సుబ్బారావు, కాంచన సౌందర్య, శీలబోయిన శ్రీను, మన్నే శ్రీను, వాకపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హృదయాలయంలో అన్నసమారాధన

నిడదవోలు: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మానసిక దివ్యాంగుల పునరావాస పాఠశాల (హృదయాలయం)లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, నీలం రామారావు, సుంకర నరసంహామూర్తి, ఎం. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

తాళ్లపూడి: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు తాళ్లపూడిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ చెప్పారు. స్థానిక పరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల్లోని మొదటి గదిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంగా తీసుకున్నామన్నారు. మండలంలో 41 మంది టీచర్ ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

గణపతి బప్పా మోరియా

- ఘనంగా గణనాథుని నిమజ్జనాలు



దేవరపల్లిలో గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు

దేవరపల్లి: 'జైజై గణనాయకా'.. 'బైబై గణేశా' అంటూ గ్రామాల్లో గణనాథుని నిమజ్జనాలు మంగళవారం వైభవంగా జరిగాయి. దేవరపల్లిలోని సుంకర దుర్గారావు వీధిలో పూజలు నిర్వహించిన గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో పల్లంట్ల గ్రామంలో నిర్వహించిన గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో మంగళవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి, మానవత సంస్థ మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ. 77,400 పలికిన వినాయకుని విగ్రహం

దేవరపల్లిలోని నిమ్మపాటి దిబ్బలు ప్రాంతంలోని వరసిద్ధి వినాయకుడి గుడి వద్ద ప్రతిష్ఠించిన గణపతి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం రాత్రి వేలం వేశారు. వేలం పాట అర్ధరాత్రి వరకూ హోరాహోరీగా జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల సీతయ్య కుమారులు రూ.77,400 లకు విగ్రహాన్ని వేలంలో దక్కించుకున్నారు. గతేడాది వేలం పాటలో విగ్రహం రూ. 69 వేలు పలికింది.



తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో..

తాళ్లపూడి: గణపతి నవరాత్రుల ముగియడంతో మండలంలోని అన్నదేవరపేటలో లక్ష్మీగణతి వినాయక కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గణనాథుని శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై వినాయకుని విగ్రహాన్ని ఉంచి ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. బుట్టబొమ్మలు, మేళతాళాలతో కోలాహలంగా ఊరేగింపు సాగింది. అనంతరం గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



దేవరపల్లిలో రూ.77,400 పలికిన గణపతి విగ్రహం

150 మందికి దంత పరీక్షలు



ఉసులుమర్రులో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెరవలి: సేవాభావంతో లయన్స్ క్లబ్‌లు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సూచించారు. లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉసులుమర్రు గ్రామంలో మంగళవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ ప్రారంభించారు. భీమవరానికి ఉందిన విష్ణు దంత వైద్య కళాశాల వైద్యులు శిబిరానికి హాజరైన 150 మందికి దంత పరీక్షలు నిర్వహించి క్లీనింగ్ చేశారు. వారిలో 26 మందిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి రావాలని సిఫార్సు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్యనాయడు, ఉప్పలపాటి సత్తిరాజు, పడాల శ్రీనివాస్, సలాది ఉదయ భాస్కరరావు, వైద్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

- జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు
- పలు ప్రాంతాల్లో స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాలు ప్రారంభం



చాగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు

తాళ్లపూడి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), మండల ప్రత్యేకాధికారి రాంబాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా తాళ్లపూడి పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బజార్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ర్యాలీలో తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వారు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీపీవో రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హై పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఆశా ఆలేఖ్య ఏపీఎం పి.రోజ్‌మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్వచ్ఛతా హీ సేవలో అందరం భాగస్వాములం అవుదామని ఎంపీడీఓ సింహాద్రి సూచించారు. స్వచ్ఛతా హీ సేవపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం కవులూరు సచివాలయ ఉద్యోగులతో కలసి ఆయన ఆ గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ పక్షోత్సవాల్లో పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై అవగాహన, తాగునీటి వనరుల క్లోరినేషన్ తదతర అంశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో కమల్‌రాజ్, హౌసింగ్ ఏఈ శివ, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ అజయ్‌బాబు, కార్యదర్శి జి.రమేష్ పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో కార్యాలయాలను శుభ్రం చేశారు.

చాగల్లులో..

చాగల్లు: స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కల్పిస్తూ చాగల్లు మెయిన్ రోడ్డుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూర్తి కాంప్లెక్ నుంచి ప్రధాన కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై నినాదాలు చేశారు. సెంటర్లో మానవ హారంగా ఏర్పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చీపుర్లు చేతబట్టుకుని రోడ్లపై చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, ఈవో పీఆర్డీ శ్రవణకుమార్, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, కార్యదర్శి ఎల్ రవికుమార్, టీడీపీ,జనసేన నాయకులు, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఉండ్రాజవరం హైస్కూలు విద్యార్థులు మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి యు.ముత్యాలనాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్కే రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు కృషి చేస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవోలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్న, పీహెచ్‌సీ సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్టీసీ డిపోలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిపో మేనేజర్ వైవీఎన్ కుమార్

ఆర్టీసీ డిపో వద్ద..

కొవ్వూరు: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీఎన్ కుమార్ తెలిపారు. స్థానిక డిపో గ్యారేజీ మెయిన్ గేట్ వద్ద మంగళవారం సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపోలోని అన్ని సెక్షన్ల సిబ్బంది తమ సెక్షన్లలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. బస్‌లను, బస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. తొలి రోజు కార్యాలయాన్ని నిర్వర్తించినట్టు డీఎం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై కొవ్వూరులో నిరసన



నిరసన తెలుపుతున్న శ్యాం రవిప్రకాష్, మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి తదితరులు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చంటూ గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. అనేక న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని సుప్రీం కోర్టు తన తీర్పును పునః పరిశీలించాలని నాయకులు కోరారు. జిల్లా బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్‌మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై తీర్పు వచ్చేంతవరకూ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లకూడదని డిమాండ్ చేశారు. అలా కానిపక్షంలో రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మాలల నుంచి ప్రతిఘటన తప్పదని నాయకులు హెచ్చరించారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా ఎస్సీఎస్టీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఏవో జవహర్‌బాజీకి అందజేశారు. మాలసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాసా ఆనంద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు రూరల్: బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి రాజ్‌కుమార్ సూచించారు. బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవార అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.నాగరాజునాయక్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్యవివాహాలు ఎక్కడ జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూల్, ఎస్సై రమేష్, ఎంఈఓలు కేవీ గణేశ్, పి.గురుమూర్తి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు పి.నళిని, సీహెచ్ లక్ష్మి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి మహోత్సవం



నిడదవోలులో పూజలు చేస్తున్న విశ్వ బ్రాహ్మణులు



గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెంలో..

నిడదవోలు: విశ్వకర్మ జయంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నిడదవోలు శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘాధ్యక్షులు గోలి రామబ్రహ్మం జండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శి నాగోజు వీర సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వ విశ్వబ్రాహ్మణులు ఐక్యతతో మరిన్ని కార్యాక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లావేటి శివన్నారాయణ, కొమ్మోజు చంద్రశేఖర్, నరేష్, వెంకటేశ్వరరావు, కె.శ్రీను, సత్యరామకృష్ణ, ఎ.శ్రీనివాస్, రవి, ఫణికుమార్, జేగేశ్వర్, సతీష్, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

వేళ్లచింతలగూడెం, గుడ్డిగూడెం గ్రామాల్లో..

గోపాలపురం: విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని వేళ్లచింతలగూడెం, గుడ్డిగూడెం గ్రామాల్లో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గానికి రూ.20 కోట్ల ఉపాధి నిధులు

- 84 పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదన
- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- నల్లజర్ల మండల పరిషత్ సమావేశం



నల్లజర్ల మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లో రూ.20 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రహదారులు, డ్రైన్లు నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వెల్లడించారు. నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనర్ పంచాయతీలకు రూ.10 నుంచి రూ.15 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.30 నుంచి రూ.35 లక్షల చొప్పున ఉపాధి నిధులు కేటాయించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో పనులు చేపట్టాలని ఆయన సర్పంచులకు సూచించారు. త్వరితగతిన పంచాయతీ పాలకవర్గ తీర్మానాలు చేసి, పనులను ప్రారంభించాలన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య విషయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. అక్టోబర్ నుంచి ప్రతి మండలంలో రైతు సదస్సులు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. తన సొంత ఖర్చుతో ప్రతి పాఠశాలకూ అన్ని రకాల కిట్లు అందిస్తామని, క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తామని వెంకట్రాజు ప్రకటించారు. అదే తరహాలో ప్రతి గ్రామంలో యువకులకు వివిధ రకాల స్పోర్ట్స్ కిట్లు అందించనున్నట్టు చెప్పారు. దసరా నుంచి సంక్రాంతి వరకూ ప్రాక్టీసు చేయించి సంక్రాంతికి పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

రైతు భరోసా సాయం ఎప్పుడిస్తారంటూ జగన్నాథపురం సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువడలేదని ఏవో కమల్‌రాజ్ బదులిచ్చారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని నబీపేట సర్పంచ్ గోతం సత్యలక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.ఆర్ అండ్ బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయని ప్రకాశరావుపాలెం సర్పంచ్ విక్టర్, సుభద్రపాలెం ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్ సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. పాఠశాలకు గేట్లు, వాటర్ సౌకర్యం కల్పించాలని ముసుళ్ల గుంట సర్పంచ్ నందమూరి శారదాదేవి కోరారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశానికి సమర్పించారు. ఎంపీడీఓ సింహాద్రి, తహసీల్దార్ కృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



అట్లపాడులో తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నిడదవోలు రూరల్: రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా రోజూ తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మండలంలోని అట్లపాడు గ్రామంలో మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ట్యాంక్ మోటార్ పాడై పోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని వారు తెలిపారు. పంచాయతీ పాలకవర్గం తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికార పార్టీ నాయకులు, అధికారులు చర్యలు తీసుకుని తాగునీరు సక్రమంగా అందించాలని కోరుతున్నారు.

పార్వతీ సుతునికి 108 ప్రసాదాల నివేదన

కొవ్వూరు: స్థానిక మెరక వీధిలోని వాటర్ ట్యాంక్ జంక్షన్ వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకునికి మంగళవారం 108 రకాల ప్రసాదాలతో మహా నివేదన చేశారు. వివిధ రకాల పండ్లు, పిండి వంటకాలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో స్థానిక భక్తులు హాజరై ప్రసాదాలు స్వీకరించారు. కొయ్యల భాస్కరరావు, మురుకొండ శ్రీనివాస్, నగళ్లపాటి శ్రీనివాస్, అడ్డూరి సుబ్బారావు, దాస్, ఆవుల వాసు, పెరుమళ్ల బాలచందర్, అత్తిలి దుర్గేష్, దావాల మహేష్, చిట్టూరి త్రినాథ్, గడదాసి శివకుమార్, యర్రగోపుల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారికి ఈనెల 18న గరిక పూజ, 20న సామూహిక లక్ష్మీ గణపతి శత మానార్చన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 23న అన్నసమారాధన, స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ



దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



పెరవలి పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ గంగోలు సీతమ్మ

దేవరపల్లి: ఒక మాత్ర ద్వారా నులిపురుగులను నులిమేయాలని గౌరీపట్నం, యాదవోలు పీహెచ్‌సీల వైద్యాధికారులు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని గౌరీపట్నం, యాదవోలు పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులతో నులి పురుగులు చేరకుండా ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. యాదవోలు పీహెచ్‌సీ పరిధిలోని 5,600 మంది విద్యార్థులకు గాను, 5370 మందికి ఈ మాత్రలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఈ నెల 25న పంపిణీ చేస్తామని సీహెచ్‌ఓ పద్మకుమారి తెలిపారు. గౌరీపట్నం పీహెచ్‌సీ పరిధిలోని 21 పాఠశాలలు, 20 అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,093 మంది పిల్లలకు గాను, 3989 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్టు సీహెచ్‌ఓ ఎ. శ్రీకృష్ణుడు తెలిపారు. ఆర్‌బీఎస్‌జీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హరిశ్చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంపై మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానిక రాంనగర్ సచివాలయ సిబ్బంది, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేశారు. వైస్ ప్రిన్సిపాల్ డి.హరీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలో 95 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశబూమని పెరవలి, కానూరు పీహెచ్‌సీల వైద్యులు ఎ. కృష్ణవేణి, కె. హేమరాజు తెలిపారు. పెరవలి పీహెచ్‌సీ పరిధిలో 5345 మంది, కానూరు పీహెచ్‌సీ పరిధిలో 5680 మంది పిల్లలు ఉన్నారు. వారిలో 95 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామని తెలిపారు. మిగిలిన పిల్లలకు బుధవారం వేస్తామని తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలో 6,889 మంది పిల్లలు ఉండగా మంగళవారం 6,154 మంది పిల్లలతో నులి పురుగుల నివారణ మాత్రలు మింగించామని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతోను, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులతోను నులి పురుగులు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు జె.శ్రీనివాసు, కె.కుమారి, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.